సాక్షి
కాకినాడ

గురువారం । 12 । డిసెంబర్ । 2024



వెదజల్లుతో సిరుల పంట

గడచిన కొన్నేళ్లుగా వరి సాగులో వెదజల్లు పద్ధతి బాగా ప్రాచుర్యం పొందింది. నారు మడి పెంచి, నాట్లు వేయకుండా నేరుగా విత్తే పద్ధతి (వెదజల్లు) పాటిస్తే, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చు.




జల్సాల కోసం చోరీల బాట

జల్సాలు, దుర్వ్యసనాలకు గురైన నలుగురు యువకులు చోరీల బాట పట్టారు. అనేక ద్విచక్ర వాహనాలను దొంగిలించి, ఉడకు పోలీసులకు పట్టుబడ్డారు.

8లో

11,200 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 11,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.50 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ప్రకృతి సాగు వైపు దృష్టి

జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ్‌కుమార్

సామర్లకోట: ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రాజెక్టు సిబ్బంది రాబోయే దాళ్వాలో ప్రకృతి వ్యవసాయం వైపు రైతుల దృష్టి మళ్లించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటకు వచ్చే అధిక ఆదాయం, తగ్గే పెట్టుబడి ఖర్చుపై అవగాహన పెంచాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన సిబ్బంది ఉత్సాహవంతులైన రైతులను గుర్తించి వారికి ప్రకృతి వ్యవసాయానికి కావలసిన కిట్స్ ఇవ్వాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన కషాయాల తయారీ విధానంపై అవగాహన పెంచడంతో పాటు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఆర్డీఎస్ కిడ్స్ తయారీ విధానం, పలు పంటల విధానం, కషాయాల తయారీ విధానాలపై అవగాహన కల్పించారు. ఏ గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్, ఎన్‌పీఎం షాప్స్ ఏర్పాటు, ఘన, ద్రవ జీవామృతాల తయారీ విధానంపై సమీక్ష నిర్వహించారు. రబీ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి టార్గెట్‌లను నిర్ణయించారు. ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ జె.ఇలియాజర్, వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ బీవీఎస్‌సీ హరి, ఏడీఏ మాధవి, మండల వ్యవసాయ అధికారి ఐ సత్య, జానకి పాల్గొన్నారు.

చేనేత సొసైటీని సందర్శించిన కేంద్ర బృందం



పెద్దాపురం చేనేత సొసైటీలో వస్త్రాల తయారీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పెద్దాపురం: స్థానిక వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీని బుధవారం కేంద్రం బృందం సందర్శించింది. ఢిల్లీకి చెందిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ డీపీఐఐటీ విభాగానికి చెందిన జస్మిన్ కౌర్, నిషేకత్ మిట్టల్ బృందం వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ స్కీమ్‌లో భాగంగా బృందం ఇక్కడ వస్త్ర తయారీ విధానంపై ఆరా తీసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు వస్త్ర తయారీకి సంబంధించి వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ స్కీమ్‌కు ఎంపికైతే అంతర్జాతీయ స్థాయిలో చేనేత అమ్మకాలకు వీలుంటుందన్నారు దీనిపై మరింత క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కేంద్రానికి నివేదిక ఇస్తామన్నారు. వారి వెంట రీజనల్ డైరెక్టర్ ధనుంజయరావు, జిల్లా ఏడీ పెద్దిరాజు, సొసైటీ మేనేజర్ తూతిక చంద్రశేఖర్, గాంధీ సొసైటీ మేనేజర్ దొరరాజు, తూతిక సత్యనారాయణ. మల్లిబాబు, బాబురావు, వెంకటరమణ తదితరులున్నారు.


దివ్యాంగులకు సహాయంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ వేణుగోపాలరావు

బాలాజీచెరువు (కాకినాడ): దివ్యాంగులకు అన్ని రంగాల్లో సహాయంగా ఉండాలని, అందుకు మండలంలో వారిని గుర్తించి బడిలో చేర్చి నమోదు చేసినప్పుడే ఇది సాధ్యమవుతుందని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పి.వేణుగోపాలరావు అన్నారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో సహిత విద్యా విభాగం ఐఈఆర్‌టీలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోపాలరావు మాట్లాడుతూ భవిత సెంటర్‌కు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులతో సత్సంబంధాలు కలిగిన ఉండాలని ప్రతీ నెల పేరెంట్స్ సమావేశం నిర్వహిస్తే పిల్లలు ఎదుర్కొనే ఇబ్బందులను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవడానికి సాధ్యమవుతుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోను భవిత సెంటర్‌లో జాయిన్ చేసుకోవాలని సూచించారు. సహిత విద్యా ఐఈ కో–ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు అందవలసిన అలవెన్స్‌లు అన్నీ కచ్చితంగా అందేందుకు డాటాను సమర్పించాలన్నారు. సమావేశంలో జీజీహెచ్ వైద్యులు సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు వైద్య సదుపాయాల గురించి వివరించారు. సమావేశంలో స్టాటస్టికల్ ఆఫీసర్ కె.జోగిరెడ్డి, సహిత విద్యా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇదేం.. చంద్రం!



‘చంద్రబాబుకు మునిశాపం ఉంది. నిజం చెబితే ఆయన తల వేయి వక్కలవుతుంది. అందుకే ఆయన నిజం చెప్పరు. చెప్పింది చేయరు’ అని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అసెంబ్లీ సాక్షిగా అన్న మాటలు అక్షర సత్యమని పదే పదే రుజువవుతున్నాయి. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా బాబు గారు హామీల అమలు ఊసెత్తడం లేదు. మాటల గారడీతో తమను నారా వారు మరోసారి మోసం చేశారని జనం అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు.

- సూపర్ సిక్స్.. అట్టర్ ఫ్లాప్
- అతీగతీ లేని ‘కూటమి’ హామీలు
- రైతులకు పెట్టుబడి సాయం ఊసే లేదు
- తుస్సుమన్న ఉచిత గ్యాస్
- ఉచిత బస్సు ప్రయాణం హుళక్కే
- సర్కార్ గద్దెనెక్కి నేటికి ఆరు నెలలు


సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో చంద్రబాబు అధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి గురువారంతో ఆరు నెలల పూర్తి అవుతోంది. ఎన్నికల ముందు హామీల మీద హామీలతో ఊరూవాడా ఊదరగొట్టిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఈ ఆరు నెలల్లో ఉద్ధరించింది ఏమీ లేదని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. అధికారంలోకి రావడమే తరువాయి అన్నీ అమలు చేస్తాం అన్నట్టు ఇచ్చిన బిల్డప్‌లను జనమంతా నమ్మారు. స్వీయ అనుభవాలు చంద్రబాబును విశ్వసించలేమని చెబుతున్నా బాబు మాటల గారడీతో జనం కూటమికి పట్టం గట్టారు. మీ ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం రూ.15,000 చొప్పున ఇస్తామని చెప్పారు. ఏటా ఇంటికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 బ్యాంకు ఖాతాలకు జమ, అన్నదాతకు అండగా ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇవన్నీ జూన్ నెల నుంచే అమలు చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా అమలు ఊసు ఎత్తడం లేదు.

అన్నదాతకు వెన్నుపోటు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండి ఉంటే ఈ రోజు ఈ పరిస్థితి ఇలా ఉండేది కాదని జనం అంటున్నారు. ఐదో విడత అమ్మ ఒడి గత జూన్ నెలలోనే జమ చేసేవారు. బాబు ఈ విద్యా సంవత్సరంలో అమ్మ ఒడి లేకుండా చేశారు. జగన్‌మోహన్ రెడ్డి ఉచిత పంటల బీమా అమలు చేస్తే కూటమి ప్రభుత్వం దాన్ని ఎత్తేసి నోట మట్టికొట్టిందని రైతులు లబోదిబోమంటున్నారు. రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా ఏటా ప్రతి రైతు కుటుంబానికి రూ.13,500 చొప్పున నాటి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించిన రోజులు రైతులు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు సాయంగా రూ.20వేలు ఇస్తామన్న చంద్రబాబు ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ మొదలవుతున్నా ఇంత వరకు ఒక్క రైతుకు చిల్లి గవ్వ ఇవ్వలేదు. అకాలవర్షాలు, వరదలతో పంట నీటమునిగి సర్వం కోల్పోయిన రైతులకు సాయం చేసింది అరకొరే. జిల్లాలో రైతులు 1,74,229 మంది ఉన్నారు. బాబు మాట ప్రకారం ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు చొప్పున ఇవ్వాలి. ఇలా గడచిన ఆరు నెలల కాలానికి చంద్రబాబు ఇవ్వకపోవడంతో రైతులు రూ.174.229 కోట్లు నష్టపోయినట్టే.

ఉత్తుత్తి హామీగానే మహిళలకు ప్రతి నెలా రూ.1,500

18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.1,500 చొప్పున ఇస్తామని చంద్రబాబు ఆశ పెట్టి ఓట్లేయించుకున్నారు. ఈ విషయాన్ని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. తీరా గద్దెనెక్కి ఆరు నెలలు కావస్తున్నా రూ.1,500 పై ఉలుకుపలుకూ లేదు. జిల్లాలో ఇందుకు అర్హత కలిగిన 7,37,471 మంది మహిళలకు ఆరు నెలలుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. 2014లో మాదిరిగానే డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానని నమ్మించి గద్దెనెక్కాక గాలికొదిలేసినట్టే ఈ హామీని కూడా అటకెక్కించేశారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా రూ.663.72 కోట్లు తమకు ఇవ్వకుండా మోసం చేసిన చంద్రబాబు, పవన్‌పై మహిళలు నిప్పులు చెరుగుతున్నారు.



తల్లికి వందనం.. పథకానికి దణ్ణం!

తల్లికి వందనం అంటూ కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి ఏడాదికి రూ.15,000 ఖాతాల్లో జమచేస్తామని కూటమి నేతలు ప్రజలను నమ్మించారు. తీరా సీఎం అయ్యాక చంద్రబాబు తల్లికి వందనంలో తల్లికి మాత్రమే రూ.15,000 ఇస్తామని జీఓ విడుదల చేయడంపై పేదలు, మధ్యతరగతి కుటుంబాలు అగ్గిమీదగుగ్గిల మవ్వడంతో సర్కార్ తూచ్ అంటూ మాటమార్చింది. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలవుతున్నా ఇంతవరకూ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో చిల్లి గవ్వ జమ కాలేదు. జిల్లాలో తల్లికి వందనానికి అర్హులైన విద్యార్థులు 1,86,708 మంది ఉన్నారు. వీరికి గడచిన ఆరు నెలల కాలానికి ఇవ్వాల్సిన రూ.140.30 కోట్లలో రూపాయి కూడా చంద్రబాబు విదల్చలేదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి ద్వారా ప్రతి కుటుంబానికి రూ.13వేలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నేరుగా జమచేశారు. మిగిలిన రూ.2000లో రూ.1,000 టాయిలెట్స్ మెయింటినెన్స్, రూ.1,000 స్కూల్ మెయింటినెన్స్ ఫండ్‌కు జమ చేశారు.

నిరుద్యోగులకూ బురిడీ

ఉద్యోగాలు ఇచ్చే వరకు 18 ఏళ్లు దాటి 35 సంవత్సరాల లోపు ఉన్నవారికి నిరుద్యోగ భృతి రూ.3,000 ఇస్తామని చంద్రబాబు దగా చేశారని యువతీ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 18 ఏళ్లు దాటి 35 సంవత్సరాలలోపు ఉన్న యువత 3.15 లక్షలు పైమాటే. వీరికి చంద్రబాబు మాట ఇచ్చినట్టుగా గడచిన ఆరు నెలల కాలానికి నిరుద్యోగ భృతిగా రూ.567 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ చంద్రబాబు మాయమాటలు నమ్మి రెండోసారి మోసపోయామని యువత మండిపడుతోంది.

2014లో నాడు నిరుద్యోగ భృతి రూ.2,000 ఇస్తామని నమ్మించి చివరకు చేతులెత్తేసిన తరహాలోనే ఇప్పుడు కూడా చంద్రబాబు ఆ హామీని గాలిలో కలిపేస్తున్నారని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

ఉచిత బస్సు ప్రయాణం తుస్సు

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అని ఊరించి ఓట్లేయించుకుని ఉసూరుమనిపించారు. కాకినాడ జిల్లా ప్రజా రవాణా పరిధిలో 300 బస్సుల్లో నిత్యం 80వేల మంది ప్రయాణికులతో రూ.50 లక్షల ఆదాయం వస్తోంది. ఇందులో సగం మంది మహిళలంటే 40వేల మంది ద్వారా రూ.25 లక్షల ఆదాయం రోజుకు వస్తుందని అంచనా. ఇలా నెలకు రూ.7.50 కోట్లు వంతున ఆరు నెలల కాలంలో రూ.45 కోట్ల ఉచిత ప్రయాణం సౌకర్యానికి మహిళలు దూరమయ్యారు.

తూతూ మంత్రంగా ఉచిత గ్యాస్

ఉచిత గ్యాస్ సిలిండర్లను కూడా తూతూమంత్రంగా ఇచ్చి మమ అనిపించేశారని మహిళలు మండిపడుతున్నారు. జిల్లాలో 91 గ్యాస్ ఏజెన్సీల ద్వారా 6.34 లక్షల వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చంద్రబాబు నమ్మించి దగా చేశారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు చెప్పిన లెక్కల ప్రకారం చూస్తే ఏడాదికి అర్హులైన కుటుంబాలకు 19,02,000 వంట గ్యాస్ సిలిండర్లు ఇవ్వాల్సి ఉంటుంది. గత ఆరు నెలల పాలనలో చూసుకుంటే 9.51 లక్షల ఉచిత సిలిండర్లు మహిళలకు అందజేయాలి. మొబైల్ లింక్ కాలేదని, బయోమెట్రిక్ అప్‌డేట్ కాలేదని కుంటిసాకులతో సగం మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందకుండా చేశారు. మూడు సిలెండర్‌లు ఇవ్వాల్సి ఉండగా ఈ ఏడాదికి ఒకే ఒక సిలిండర్‌తో సరిపెట్టేశారు.

హామీలన్నీ వట్టి మాటలే..



రైతులకు ఎంతో మేలు చేస్తామంటూ కూటమి నేతలు ప్రకటించారు. కాని అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలేదు. రూ.20 వేలు వేస్తామని చెప్పారు వేయలేదు. పెట్టుబడి రాయితీ ఇస్తామన్నారు ఇవ్వలేదు. గతంలో ఇన్సూరెన్సు ప్రీమియం ప్రభుత్వం చెల్లించేది. ఇప్పుడు రైతులు చెల్లించాల్సి వస్తోంది. కూటమి నేతలు ఇచ్చిన హామీలన్నీ వట్టి మాటలుగానే మిగిలిపోయాయి.

– కాజులూరి నేరేళ్లరెడ్డి, రైతు, రమణక్కపేట, కొత్తపల్లి మండలం

ట్యూషన్ ఫీజు చెల్లిస్తేనే పరీక్ష ఫీజు తీసుకుంటామంటున్నారు



కళాశాలకు చెల్లించవలసిన ట్యూషన్ ఫీజు చెల్లిస్తేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటామని కళాశాల యాజమాన్యం కరాఖండీగా చెబుతోంది. అడ్మిషన్ ప్రారంభ సమయంలో మొదటి వాయిదా చెల్లించగా ఇప్పుడు రెండో వాయిదా చెల్లిస్తేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటామంటున్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఏ విధమైన నిర్ణయం రాలేదు. మాలాంటి పేదలకు చాలా కష్టంగా ఉంది. ఇప్పటికే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేశారు. ఎలా చెల్లించాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంది.

– వై.ధనలక్ష్మి, కాకినాడ

మెగా డీఎస్సీ కోసం ఆశపడ్డాం



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా మెగా డీఎస్సీ విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో నిరుద్యోగ యువతీ యువకులు అనేకమంది కూటమికి ఓట్లు వేశారు. ఆరు నెలలు పూర్తయినా ఇప్పటివరకు మెగా డీఎస్సీ ప్రస్తావన రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. డీఎస్సీకి సంబంధించి వయో పరిమితి 44 సంవత్సరాలు కాగా నోటిఫికేషన్ రాకుండానే అనేకమంది అర్హత కోల్పోయే అవకాశం ఉంది.

– డి.రాజు, నిరుద్యోగి, సామర్లకోట

ఉచిత బస్సు ఏది?



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం లేదు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయ్యింది. ఎప్పుడు అమలు చేస్తారో తెలియడం లేదు. దీని ద్వారా మహిళలపై తమకున్న ప్రేమ ఏమిటో కూటమి ప్రభుత్వం చెప్పకనే చెబుతున్నది. కూటమి ప్రభుత్వం మహిళలను దగా చేసింది.

– అరవాల వరలక్ష్మి, గృహిణి, ఏలేశ్వరం

రత్నగిరికి భక్తుల తాకిడి



సత్యదేవుని ఆలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయానికి మార్గశిర శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న నవ దంపతులు, వారి బంధుమిత్రులతో కలిసి సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కాగా మార్గశిర శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర పూజ చేశారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉద్యోగం ఊడింది.. లంచం డబ్బు తిరిగివ్వండి

- కొలువులు కోల్పోయిన అభ్యర్థుల గగ్గోలు
- తమను మభ్యపెట్టిన డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారిపై గుర్రు

కాకినాడ క్రైం: ‘మీకు పర్మినెంట్ ఉద్యోగం గ్యారంటీ అని చెప్పి మా దగ్గర లంచాలు తీసుకున్నారు. ఇప్పుడేమో ఆ ఉద్యోగాలు పోయి రోడ్డున పడ్డాం. మా దగ్గర తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వండి.’ అని ఎంపీహెచ్ఏ (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్)ల అడుగుతున్నారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం ఈ వివాదానికి కేంద్ర బిందువైంది.

అసలేం జరిగిందంటే...

2002లో రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్ఏ మేల్ అభ్యర్థుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ఆధారంగా అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 217 పోస్టుల భర్తీకి సన్నాహాలు చేశారు. పదవ తరగతి అర్హతతో ఈ ఉద్యోగ నియామకాలు జరిగాయి. రాత పరీక్ష, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. అయితే పదవ తరగతి పూర్తి చేశామని దరఖాస్తు చేసుకున్న కొందరు ప్రైవేటు పాఠశాలల్లో చదువు పూర్తి చేయగా వారి సర్టిఫికెట్ల వాస్తవికతపై అనుమానాలు వ్యక్తమై అనుమతించలేదు. ఈ విషయంపై అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. నిర్ణీత 217 పోస్టులకు అదనంగా సుమారు 125 మంది తమ అర్హతను ప్రస్తావిస్తూ 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ పార్కు వద్ద ధర్నాకు దిగారు. ఎన్నికల ముందు వివాదాలకు చెక్ పెట్టాలనుకున్న అప్పటి ప్రభుత్వం గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ పేరుతో ఓ కమిటీ వేసింది. వారి సిఫారసుతో మెరిట్, రోస్టర్‌ల అవసరం లేకుండా ఉద్యోగాలు ఇచ్చేయాలని తీర్మానించింది. దీంతో అప్పటి ప్రభుత్వం 1207 జీవో ద్వారా, నిరసనకు దిగిన 125 మందికి నియామక నిబంధనలు తుంగలో తొక్కి రాజకీయ ప్రయోజనం కోసం ఉద్యోగాలు ఇచ్చేసింది. దీంతో జిల్లాలో ఎంపీహెచ్ఏ మేల్ సంఖ్య 217కి బదులు 342కి చేరింది. మెరిట్, రోస్టర్‌కు తావు లేకుండా కేవలం నిరసనతో ఉద్యోగాలు పొందిన వీరి వ్యవహారంపై మెరిట్ ఉన్న కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అలా వ్యక్తిగతంగా ఆశ్రయిస్తూ కోర్టు ఆర్డర్లు తెచ్చుకోవడం మొదలు పెట్టారు. ఇలా కోర్టును ఆశ్రయించిన వారి సంఖ్య సుమారు 150 మంది కాగా, వారందరూ ఉద్యోగాలు పొందారు. ఈ నియామకాలతో కలిపి ఎంపీహెచ్ఏల సంఖ్య 492కి చేరింది. అయితే అప్పటి కేసుపై హైకోర్టు కొద్ది రోజుల క్రితం తుది తీర్పు వెలువరించింది. 2002లో నోటిఫికేషన్‌లో ప్రకటించిన 217 పోస్టులు మాత్రమే ఫైనల్ అని స్పష్టం చేసింది. ప్రభుత్వం కోర్టు తీర్పును అనుసరించి కింది కోర్టుల ఉత్తర్వులు, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సిఫారసుతో వచ్చిన వారిని తొలగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో వీరంతా ఉద్యోగాలు కోల్పోయారు. అయితే వీరు నిరసనలు, పోరాటాల దశలో ఉన్నప్పుడు వారి అవసరాన్ని అడ్డుగా పెట్టుకొని కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు, సిబ్బంది డబ్బు గుంజుకున్నారు. అప్పటి ఇన్‌చార్జి ఏవో, ప్రస్తుత డిప్యూటీ డెమో పాత్ర కీలకమని బాధితులు అంటున్నారు. వారు తమ వేదనను వెళ్లగక్కుతున్నారు. ఉద్యోగాలు గ్యారంటీగా వస్తాయని ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారని, ఇప్పుడు ఉద్యోగం పోయి రోడ్డున పడ్డామనీ ఆ మొత్తాన్ని తమకు తిరిగి ఇప్పించాలని బాధితులు డీఎంహెచ్‌వోను కలిసి వేడుకున్నారు. తమ డబ్బు తిరిగి ఇవ్వాలని వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి ఇన్‌చార్జి ఏవోతో వాదనలు పడుతున్నారు.



కాకినాడలోని డీఎంహెచ్‌వో కార్యాలయం

సాగునీటి సంఘాల ఎన్నికల సందడి

- 14న అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎలక్షన్
- 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు...


కాకినాడ సిటీ: జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల సందడి మొదలైంది. అధిక భాగం ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం ప్రాదేశిక నియోజకవర్గాలు, సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్ జారీ చేసింది. అసాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించే వేదికను తెలియజేస్తారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద నోటీసులు అంటించడంతో పాటు గ్రామాల్లో దండోరా వేస్తారు. ఈ నెల 14న ప్రాదేశిక నియోజక వర్గాలకు ఎన్నికైన వారితో అసాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించి సాగునీటి వినియోగదారుల సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికల తేదీ, సమయం, వేదిక గురించి సమాచారంతో పాటు మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షులకు నోటీసుల ద్వారా తెలియజేస్తారు. ఈ నెల 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల అసాధారణ సర్వసభ్య సమావేశాలను నిర్వహించి ఛైర్మన్లను ఎన్నుకుంటారు.

మొత్తం 236 సంఘాలు

జిల్లాలో 236 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉండగా వాటి పరిధిలో 1992 టెరిటోరియల్ నియోజకవర్గాలు, 20 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 110 మైనర్ ఇరిగేషన్ కమిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో 97వేల హెక్టార్ల ఆయకట్టు ఉండగా 1.32 లక్షల మందికి పైగా ఓటర్లు ఉన్నారు. చిన్నతరహా నీటి పారుదల కింద 21 మండలాల్లో 142 వరకు సాగునీటి వినియోదారుల సంఘాలు ఉన్నాయి.

ఏకగ్రీవం కాని చోట రహస్య ఓటింగ్

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడైనా ఏకగ్రీవ ఎన్నికల జరగని సందర్భాల్లో చేతులెత్తి ఎన్నుకునే విధానాన్ని అనుసరిస్తే ఓటర్లు ఎవరికి ఓటు వేశారో అభ్యర్థులకు తెలిసిపోతుంది. ఇందువల్ల వారిని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంటుంది. మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్ (ఎన్నికల నిర్వహణ) రూల్, 118 ప్రకారం చేతులెత్తే పద్ధతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది. కనుక చేతులెత్తే విధానం కాకుండా రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికల నిర్వహించాలంటూ ఇటీవల కొందరు హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. 2020లో దాఖలైన కేసులో రహస్య ఓటింగ్ అనేది రాజ్యాంగ పరమైన ప్రజాస్వామ్యంలో కీలకమైనదంటూ అపెక్స్ కోర్టు తన తీర్పులో స్పష్టం చేసిన విషయాన్ని కూడా పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్ రాష్ట్ర హైకోర్టు ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనానికి వెళ్లింది. ఏకాభిప్రాయం కుదరని చోట రహస్య బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకుంటామనే రైతులను, అందుకు అనుమతించాలని, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏకాభిప్రాయం కుదరని చోట విధిగా రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.



క్లుప్తంగా

అధికారుల అలసత్వం వల్లే దాడి

చర్యలకు మానవ హక్కుల వేదిక డిమాండ్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్‌తో మాట్లాడుతున్న వేదిక ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లిలో అక్రమ ఆక్వా సాగుపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయడంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ ఇక్బాల్, నామాడి శ్రీధర్ డిమాండ్ చేశారు. అధికారులు హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయడంలో అలక్ష్యం వహించడం వల్లే బాధితుడు చిక్కం వీర దుర్గాప్రసాద్‌పై కొందరు ఆక్వా రైతులు దాడి చేశారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్‌ను మానవ హక్కుల వేదిక ప్రతినిధులు బుధవారం కలిసి, ఘటనపై నిజనిర్ధారణ చేశారు. అక్రమ ఆక్వా చెరువుల సాగు, తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని దుర్గాప్రసాద్ హైకోర్టులో పిల్ వేశారని శ్రీధర్ తెలిపారు. కలెక్టర్ కూడా వాటి సాగును నిలిపివేసేందుకు ఆదేశాలిచ్చారన్నారు. ఇటీవల మళ్లీ కొందరు రైతులు సాగు మొదలెట్టడంతో, దుర్గాప్రసాద్ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆధారాలు సేకరించమని అధికారులే దుర్గాప్రసాద్‌కు చెప్పడంతోనే అతడిపై ఆక్వా రైతులు దాడి చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆక్వా రైతుల ముసుగులో ఉన్న మాఫియాపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నేత మోహన్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతిరావు డిమాండ్ చేశారు.

నలుగురి అరెస్ట్

సన్నవిల్లిలో దుర్గాప్రసాద్‌పై దాడి కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై సీహెచ్ రాజేష్ బుధవారం తెలిపారు. నిందితులను ముమ్మిడివరం కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్ విధించారు.

21న జెడ్పీ సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, 1 నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశం ఈ నెల 21న ఉదయం 10.30 నుంచి జరుగుతాయని జెడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు.

వెదజల్లుతో సిరుల పంట

- ఈ సాగు విధానంలో ప్రయోజనాలెన్నో..!
- పెట్టుబడులు, సాగునీరు ఆదా
- పది రోజుల పాటు తగ్గనున్న పంటకాలం



కె.బాబూరావు, ఏడీఏ, కరప సబ్ డివిజన్



ఏవీ రాజేష్, ఎంఏఓ, కరప మండలం

కరప: జిల్లావ్యాప్తంగా గడచిన కొన్నేళ్లుగా వరి సాగులో వెదజల్లు పద్ధతి బాగా ప్రాచుర్యం పొందింది. వరి సాగులో నారుమడి పెంచి, నాట్లు వేయకుండా నేరుగా విత్తే పద్ధతి(వెదజల్లు) పాటిస్తే, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చు. ఈ పద్ధతి వల్ల వరి నారు పెంచడానికి, నాట్లు వేయడానికి ఖర్చు ఆదా అవుతుంది. సాగునీరు కూడా ఎక్కువ అవసరం ఉండదు, పంట కాలం ఏడు నుంచి పది రోజులు తగ్గుతుందని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్ వివరించారు. వెదజల్లు పద్ధతి అనుసరించే రైతులకు కీలకమైన జాగ్రత్తలు తెలిపారు. సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

ప్రయోజనాలివే..

ఎకరానికి 12 కిలోల విత్తనాలు చల్లితే సరిపోతుంది. 15 నుంచి 20 కిలోల విత్తనాలు ఆదా అవుతాయి. పంట కాలం వారం నుంచి పది



కరప మండల కేంద్రంలో వెదజల్లు సాగుకు ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



వాకాడ గ్రామంలో వెదజల్లిన పొలం

రోజులు తగ్గుతుంది. ఆకు పెంచడం, ఆకుతీత, నాట్లు వేసే పని ఉండదు, రూ 10 వేల సాగు ఖర్చు తగ్గుతుంది. మొక్కల సాంద్రత సరిపడా ఉండటం వల్ల దిగుబడి 10 నుంచి 15 శాతం పెరుగుతుంది. సాగునీరు ఆదా అవుతుంది. ఈ పద్ధతిలో మడిలో సూర్యరశ్మి, గాలి బాగా సోకి, చీడపీడల బెడద బాగా తగ్గి, తద్వారా సస్యరక్షణ ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుంది.

నేల తయారీ

విత్తడానికి వారం, పది రోజులు ముందుగా దమ్ము చేసి పొలాన్ని తయారుచేయాలి. చివరి దమ్ము చేసిన తర్వాత పొలంలో ఎత్తుపల్లాలు లేకుండా సమానంగా చదును చేసుకోవాలి. మట్టి పేరుకున్న తర్వాత, బురద పదునులో ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. వంతున కాలువలు ఏర్పాటుచేయాలి. వీటిద్వారా ఎక్కువగా ఉన్న నీరు, మురుగు నీరు బయటకు పోవడానికి వీలవుతుంది.

విత్తనాల రకాలు

ఈ రబీలో ఎంటీయూ 3626(బొండాలు), ఎంటీ 15(టాటా బొండాలు), ఆర్ఎన్ఆర్ 15048, ఎన్ఎల్ఆర్–34449(నెల్లూరు సన్నాలు) అనువైనవి.

విత్తన శుద్ధి, విత్తు విధానం

వెదజల్లు పద్ధతిలో రకాన్ని బట్టి ఎకరానికి 12 కిలోల వరకు విత్తనం అవసరం అవుతుంది. వెదజల్లే విధానంలో విత్తే ముందు ఒక కిలో విత్తనానికి ఒక గ్రాము బావిస్టిన్ కానీ, 8 గ్రాముల సూడోమోనస్ పొడి మందు ఒక లీటరు నీటిలో కలిపిన ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నాన పెట్టాలి. 24 గంటలు మండికట్టి మొలకెత్తిన విత్తనాన్ని పొలంలో సమానంగా పడేలా వెదజల్లుకోవచ్చు.

డ్రమ్ము సీడర్‌తో విత్తితే..

పంట తొలి దశలో వరసల మధ్య కోనోవీడర్‌ను వాడి కలుపు మొక్కలను నేలలో తొక్కివేయవచ్చు. కలుపు మందు వేసిన 4, 5 రోజుల వరకు నీరు బయటకు పోకుండా చూడాలి.

సస్యరక్షణ

నేరుగా విత్తే పద్ధతిలో పురుగులు, తెగుళ్ల తాకిడి తక్కువగా ఉంటుంది. మొక్కకు గాలి, వెలుతురు బాగా ప్రసరించడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి, అందువల్ల సస్యరక్షణకు అయ్యే ఖర్చు కూడా తగ్గుతుంది. అవసరాన్ని బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఆయా సమయాల్లో వ్యవసాయ నిపుణులను సంప్రదించి, వారి సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

కలుపు యాజమాన్యం

నేరుగా విత్తే పద్ధతిలో పండించే పొలాల్లో కలుపు సమస్య అధికంగా ఉంటుంది. సరైన సమయంలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలి. విత్తిన 35–40 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. విత్తిన 1–10 రోజుల మధ్య ఎరేజ్–ఎన్, సిరియస్ 400 మి.లీ.+12 గ్రాములు లేదా ఎరాస్ గోల్డ్ 800 గ్రాములు లేదా కౌన్సిల్ యాక్టివ్ 90 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి, ఒక ఎకరాకు పిచికారీ చేయాలి. వరి నాటిన, వెదజల్లిన 15–25 రోజుల మధ్య నోవ్ లెక్ట్ 500 మి.లీ లేదా నామినీ గోల్డ్ 100 మి.లీ లేదా ఆల్‌మిక్స్ 8 గ్రాములు లేదా సాధీ 80 గ్రాములు లేదా వివాయా ఒక లీటరు మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి.

ఎరువుల నిర్వహణ

నాట్ల పద్ధతిలో వేసే విధంగానే ఎరువులు వేయాలి. సిఫార్సు చేసిన ఎరువుల్లో పూర్తి భాస్వరాన్ని, సగం పొటాష్ ఎరువును దమ్ములో వేయాలి. సిఫార్సు చేసిన నత్రజని(యూరియా) ఎరువును మూడు సమ భాగాలు చేసి, విత్తిన 15 రోజుల్లోపు, పిలకలు తొడిగే దశలో, అంకురం ఏర్పడే దశలో వేయాలి. దమ్ములో నత్రజనిని వేయరాదు. ఎందుకంటే కలుపు ఎక్కువగా వస్తుంది. మిగిలిన సగం పొటాష్‌ను అంకురం ఏర్పడే దశలో నత్రజనితో కలిపి వేయాలి. దాళ్వాలో ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ దమ్ములో వేయాలి. పైరుపై జింక్‌లోపం కనిపిస్తే.. జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు ఒక లీటరు నీరు వంతున కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

పాడి-పంట

నీటి యాజమాన్యం ఇలా..

విత్తిన తర్వాత మొక్కలు మొదటి ఆకు **పూర్తిగా విచ్చుకునే** వరకు (సుమారు 7–10 **రోజులు) నీరు** నిల్వ ఉండకుండా, పొలం **తడిగా ఉంచాలి** (ఆరుతడులు ఇవ్వాలి). **మొక్క 4, 5 ఆకులు** తొడిగిన తర్వాత పొలంలో పలచగా అంటే 2, 3 సెం.మీ. లోతు నీరుంచాలి. అంతకుమించి నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు చేయదు. పైరు పిలక తొడిగి దుబ్బు కట్టుట పూర్తయ్యాక కోతకు పది రోజుల ముందు వరకు మడిలో 5 సెం.మీ. లోతు నీరుంచాలి.

బాలుడి మృతదేహం లభ్యం

కారు ప్రమాదంలో మూడుకు చేరిన మృతులు



మనోజ్ మృతదేహం

పి.గన్నవరం: ఊడిమూడి శివారు ఆర్పీ రోడ్డులో చింతావారిపేట వద్ద మంగళవారం తెల్లవారుజామున ప్రధాన పంట కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో గల్లంతైన నేలపూడి మనోజ్(5) మృతదేహం బుధవారం లభ్యమైంది. ఈ ప్రమాదంలో కాలువలో పడి తల్లితో పాటు, ఇద్దరు కుమారులు మరణించడంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది. మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన నేలపూడి విజయకుమార్ తన భార్య ఉమ(31), కుమారులు రోహిత్(9), మనోజ్(5) అరకు నుంచి ఇంటికి తిరిగొస్తుండగా, వారు ప్రయాణిస్తున్న కారు చింతావారిపేట వద్ద అదుపుతప్పి ప్రధాన పంట కాలువలోకి దూసుకెళ్లిన విషయం విదితమే. తల్లి ఉమ, పెద్ద కుమారుడు రోహిత్ మృతదేహాలు అదే రోజు లభ్యం కాగా, చిన్న కొడుకు మనోజ్ మృతదేహం సంఘటన స్థలికి వంద మీటర్ల దిగువన బుధవారం లభ్యమైంది. మృతదేహానికి రాజోలు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ఈ ఘటనలో భార్య, ఇద్దరు కుమారులను కోల్పోయిన బాధితుడు విజయకుమార్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పోతవరంలో బాధిత కుటుంబాన్ని బుధవారం ఆమె పరామర్శించారు. సర్పంచ్ వడలి కొండయ్య, మాజీ సర్పంచ్ గుత్తుల దాసు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

చిక్కని పులి ఆచూకీ

- ఆరు ట్రాప్ కెమెరాల ఏర్పాటు
- అటవీ అధికారుల విస్తృత గాలింపు



బాపన్నదార అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాను ఏర్పాటు చేస్తున్న అధికారులు



రౌతుపాలెంలో గుర్తించిన పాదముద్రలు

ప్రత్తిపాడు రూరల్: అంతుచిక్కని పులి ఆచూకీ కోసం అటవీ అధికారులు విస్తృతంగా గాలిస్తున్నారు. గత శనివారం బురదకోట గిరిజన గ్రామంలో గిత్త దూడపై పులి దాడి చేసిన విషయం విదితమే. పాదముద్రల ఆధారంగా దాడి చేసింది పెద్ద పులేనని అధికారులు నిర్ధారించారు. అయితే దాని జాడ ఇప్పటివరకు లభించలేదు. బుధవారం పులి జాడ కోసం ధారపల్లి, బాపన్నదార అటవీ ప్రాంతాల్లో అటవీ అధికారులు, సిబ్బంది ముమ్మరంగా గాలించారు. బాపన్నదార, పరిసర ప్రాంతాల్లో నాలుగు, దారపల్లి పరిసర ప్రాంతాల్లో రెండు ట్రాప్ కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. పులి హతమార్చిన జంతువు కళేబరం వద్దకు వస్తుందన్న అనుమానంతో వరుసగా మూడు రోజుల పాటు అధికారులు నిఘా ఉంచారు. అది రాకపోవడంతో, ఐదో రోజు కచ్చితంగా వచ్చే చాన్స్ ఉందని అటవీ అధికారులు భావిస్తున్నారు. అదే జరిగితే ట్రాప్ కెమెరాల్లో పెద్ద పులి రికార్డు అవుతుంది. రౌతుపాలెం పరిసర ప్రాంతాల్లో పులి సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. అక్కడ లభించిన పాదముద్రలు పులివో, కావో ధ్రువీకరించాల్సి ఉంది. వాతంగి పరిసర ప్రాంతాల్లో పులి ఉండే అవకాశం ఉన్నట్టు అధికారులు భావిస్తున్నారు.

రెండేళ్ల క్రితం..

నూతన కారిడార్‌లో భాగంగా రెండేళ్ల క్రితం ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 40 రోజులకు పైగా సంచరించి నర్సీపట్నం వైపు బెంగాల్ టైగర్ వెళ్లిపోయింది. ఇక్కడ నుంచి వెళ్లిన మరో 40 రోజుల్లో విజయనగరం జిల్లాలో పులి అలజడి సృష్టించింది. ఇప్పుడు ఇక్కడకు వచ్చింది బెంగాల్ టైగరా, లేక విజయనగరంలో సంచరించిన ఆడ పులా అని జనం చర్చించుకుంటున్నారు.

ఇలాఉండగా పులి సంచరించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అటవీ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. అత్యవసర పనులుంటే మినహా ఎవరూ బయటకు రావద్దని సూచించారు. పశువులను పొలాల్లో ఉంచవద్దన్నారు. ధారపల్లిలో జలపాతానికి సందర్శకులెవరూ రావద్దని అధికారులు హెచ్చరించారు. ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఎఫ్ఆర్ఓ దుర్గా రాంప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రయాణికులకు సెల్‌ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

తుని: రైళ్లలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ప్రయాణికులకు అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేసి అందజేశామని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ప్రయాణికులు పోగొట్టుకున్న 34 సెల్‌ఫోన్లను విజయవాడ రైల్వే ఎస్పీ, రాజమహేంద్రవరం డీఎస్పీ రత్నరాజు ఆదేశాల మేరకు బుధవారం తుని జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వ్యక్తులకు అందజేశామన్నారు. వీటి విలువ రూ.7,04,600 ఉంటుందన్నారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ల రికవరీలో కీలక పాత్ర పోషించిన సిబ్బందిని ఆయన అభినందించారు.

లారీ ఢీకొని టీచర్ మృతి

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామ శివారున పెట్రోలు బంక్ సమీపంలో మంగళవారం రాత్రి మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఆరేపల్లి అనిల్ కుమార్(31) మృతి చెందారు. అతడు కాతేరులోని తిరుమల స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని తిరిగి స్వగ్రామమైన ఐ.పంగిడి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ చేరుకునే సరికి అతడు చనిపోయినట్టు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. అవివాహితుడైన అనిల్‌కుమార్ తండ్రి గతంలోనే మరణించారు. తల్లితో పాటు అతను కలిసి ఉంటున్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బొకారో ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న రైల్వే పోలీసులు

అన్నవరం: అలెప్పీ–ధన్‌బాద్ బొకారో ఎక్స్‌ప్రెస్‌లో రవాణా చేస్తున్న 30.040 కేజీల గంజాయిని అన్నవరం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు, ఆ గంజాయి విలువ రూ.1,50,200 ఉంటుందని చెప్పారు. రైళ్లలో గంజాయి రవాణా చేస్తున్నట్టు రాజమండ్రి నుంచి నిఘా వర్గాల సమాచారం రావడంతో, బుధవారం సాయంత్రం అన్నవరంలో రైళ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బొకారో ఎక్స్‌ప్రెస్‌లో 12 బ్యాగుల్లో గంజాయి ఉన్నట్టు అనుమానంగా ఉందని రైలు సీటీఐ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తనిఖీలు నిర్వహించి, ఆ బ్యాగులను స్వాధీనం చేసుకుని తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బ్యాగుల విషయమై ప్రయాణికులను ప్రశ్నించగా, ఎవరూ తమవి కావని చెప్పారు. దీంతో ఆ గంజాయిని స్వాధీనం చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

మలికిపురం: చింతలమోరి గ్రామం జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న అదే గ్రామానికి చెందిన విద్యార్థి జిల్లెళ్ల బన్నీ(14) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పి.సురేష్ తెలిపిన వివరాల మేరకు, వ్యసనాలకు అలవాటు పడిన అతడు ఖర్చుల కోసం ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో గ్రామంలోని శంకరగుప్తం డ్రెయిన్‌లో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాల కోసం చోరీల బాట

- పోలీసులకు పట్టుబడిన నలుగురు యువకులు
- 29 మోటార్ సైకిళ్లు స్వాధీనం



రికవరీ చేసిన వాహనాలతో సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జల్సాలు, దుర్వ్యసనాలకు గురైన నలుగురు యువకులు చోరీల బాట పట్టారు. అనేక ద్విచక్ర వాహనాలను దొంగిలించి, తుదకు పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో ముగ్గురు మైనర్లు కావడం విశేషం. రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ వి.అప్పారావు వివరాలు వెల్లడించారు. రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో ఇటీవల మోటార్ సైకిళ్ల దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఎస్పీ డి.నరసింహ కిషోర్ పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిఘా పెంచారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ వి.అప్పారావు, ఎస్సై వి.అప్పలరాజు సిబ్బందితో కలిసి కాతేరు గామన్ వంతెన వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నలుగురు యువకులు మోటార్ సైకిళ్లపై అనుమానాస్పదంగా తారసపడడంతో, వారిని అదుపులోకి తీసుకుని ఆరా తీశారు. వీరిలో వీవర్స్‌కాలనీకి చెందిన కుప్పం తేజతో పాటు, మరో ముగ్గురు మైనర్లు ఉన్నారు. వీరు జల్సాలు, దురలవాట్లకు బానిసలై, డబ్బు కోసం మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడ్డారు. ఇళ్ల ముందు, ఇతర ప్రాంతాల్లో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను మారు తాళంతో తీసి, వాటిని కొంతకాలం దాచిపెట్టారు. వాటిని ఒక్కొక్కటిగా అమ్మి,, వచ్చిన డబ్బుతో అవసరాలు తీర్చుకునేవారు. వీరితో పాటు కొంతమూరుకు చెందిన శ్రీరామ్ అనే యువకుడు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడు. వీరంతా రూ.11.60 లక్షల విలువైన 29 మోటార్ సైకిళ్లను దొంగిలించారు. కొన్ని మోటార్ సైకిళ్లను కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామానికి చెందిన వాడబోయిన రమేష్, గుర్రాల వెంకన్న, దేవేన రాజు అనే వ్యక్తులకు అమ్మారు. మిగిలిన వాటిని రాజమహేంద్రవరం క్వారీ గోతుల వద్ద దాచారు. వీరి నుంచి 29 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కుప్పం తేజను న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించగా, ముగ్గురు మైనర్లను జువైనల్ హోంకు తరలించారు.

తల్లిదండ్రులూ జాగ్రత్త: ఎస్పీ

యువత చెడు మార్గాల్లోకి వెళ్లకుండా వారి తల్లిదండ్రులు, పెద్దల పర్యవేక్షణ ఉండాలని ఎస్పీ నరసింహ కిషోర్ చెప్పారు. ఎప్పటికప్పుడు వారి నడవడికను, వారు చేసే ఖర్చులను పరిశీలిస్తుండాలన్నారు. అశ్రద్ధ వహిస్తే సమాజం ఎదుట తలదించుకునే పరిస్థితి ఉండవచ్చన్నారు. యువత చదువుపై దృష్టి సారించి ప్రయోజకులు కావాలని సూచించారు. కేసులో విశేష కృషి చేసిన డీఎస్పీ రమేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ అప్పారావు, ఎస్సై అప్పలరాజు హెచ్‌సీలు టి.లోవకుమార్, ఎం.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు విజయ్, పవన్ కె.శ్రీనివాసరావును ఎస్పీ అభినందించారు. రివార్డులు ప్రకటించారు.

దగ్ధమైన బ్యాటరీ బైక్



రాజానగరం: బ్యాటరీ బైక్ అయితే పెట్రోలు, డీజిల్ బాధలు ఉండవని అంతా భావిస్తుంటారు. బ్యాటరీ పేలితే పరిస్థితి దారుణంగా ఉంటుంది. మండలంలోని చక్రద్వారబంధంలో బుధవారం అదే జరిగింది. బైక్ యాజమాని అపాయాన్ని ముందుగానే పసిగట్టడంతో ప్రాణాలతో బయటపడ్డారు. బైకు మాత్రం మంటలకు ఆహుతైంది. వివరాలిలా ఉన్నాయి. చక్రద్వారబంధానికి చెందిన చిక్కాల రాఘవ ఏడాది క్రితం రాజమహేంద్రవరంలోని ఓ షోరూమ్‌లో బ్యాటరీ బైకును కొనుగోలు చేశారు. వ్యవసాయ పనులకు ఈ బైక్ అనువుగా ఉంటుందని భావించి, అలాగే వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కూడా పొలానికి వెళ్లి, సాయంత్రం ఇంటికి తిరిగొస్తుండగా, సీటు దిగువ ఉన్న బ్యాటరీ నుంచి చిటపట మంటూ శబ్దం రావడాన్ని గమనించారు. బైకును ఆపి, చూస్తే ఆ బ్యాటరీ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసి, బైకు అంతటా వ్యాపించాయి. చూస్తుండగానే బైకు కాలి బూడిదైపోయింది. ప్రాణాలు దక్కాయంటూ ఆయన ఊపిరిపీల్చుకున్నారు. బైకును కొనుగోలు చేసిన షోరూమ్ నిర్వాహకులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. వారు ఏమీ సర్దిచెప్పకుండా, గ్యారంటీ పీరియడ్ ఏడాది మాత్రమేనని, తాము చేసేమీలేదంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో బైకు కాలిపోయిందనే బాధ కంటే, వారి నిర్లక్ష్యపు సమాధానానికి హతాశుడయ్యారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

కాకినాడ లీగల్: బంగారం చోరీ చేసిన వ్యక్తికి ఏడు నెలల జైలు,రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, కాకినాడ డైరీఫామ్ ప్రాంతానికి దాసరి హరిష్ గతేడాది డిసెంబర్ 19న ఎస్.అచ్యుతపురం గోకులం వద్ద ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితునికి న్యాయమూర్తి శిక్ష విధించారు. ఏపీపీ పి.రఘువీర్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

బైక్ చోరీ కేసులో..

అలాగే బైక్ చోరీ కేసులో కాకినాడ జగన్నాథపురానికి చెందిన దేవ ప్రకాష్‌కు ఐదు నెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ బుధవారం తీర్పు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 18న కొవ్వూరు గ్రామంలో అతడు బైక్ చోరీ చేసినట్టు ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.